క్లుప్తంగా

చలివేంద్రాలు ఏర్పాటు అభినందనీయం

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



తెనాలిఅర్బన్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మహాప్రస్థానం సేవా సమితి కార్యదర్శి జెట్టి శివరామకృష్ణప్రసాద్ సహకారంతో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, జానీ, ప్రవీణ్, గిరీష్, సాయి, పాపయ్య చౌదరి, పోతురాజు, చంటి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డైనమిక్ కిడ్స్ క్యాంప్



తెనాలిఅర్బన్: జీసస్ కాల్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో చెంచుపేటలోని ప్రెయర్ టవర్‌లో జరుగుతున్న డైనమిక్ కిడ్స్ క్యాంప్ గురువారంతో ముగిసింది. చిన్నారులకు బైబిల్ వాఖ్యాల కంఠస్థం, క్రైస్తవ పాటలు, సంగీతం వంటి పోటీలను నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి తెనాలి ప్రతినిధి కాండ్రు ప్రకాష్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో టీచర్స్ సిహెచ్ శాంత కుమారి, ఎస్ పెర్సిస్ సౌందర్య రాణి తదితరులు పాల్గొన్నారు.

ఆ చట్టంతో ఆటో డ్రైవర్లకు నష్టం



తెనాలిరూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన న్యాయ సంహిత చట్టం వలన ఆర్టీసీ, ఆటో ట్రాన్స్‌పోర్ట్ రంగాలు బలైపోతాయని ఆ కార్మికులు వీధిన పడే ప్రమాదం ఉందని సీఐటీయూ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గుర్రం జాషువా ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవం సందర్భంగా గురువారం జెండా ఆవిష్కరణ చేసి ఆయన మాట్లాడారు. ఈ పూరి ప్రసాదరావు అధ్యక్షత వహించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాల వలన ఊబర్ ఓలా వంటి పెద్ద సంస్థలకే అవకాశం ఉందని, చిన్న చిన్న కార్మికులు నష్టపోతారని చెప్పారు. విధానాలకి వ్యతిరేకంగా ఆటో వర్కర్లందరూ ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో ఎం. యాకోబు, మేకల ప్రసాద్, గుంటూరు సురేష్, తెనాలి సుందర్ సింగ్, రావూరి నెల్సన్, కె. రామారావు, టి. నాగేశ్వరరావు, జ్యోతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైలులో ల్యాప్‌టాప్ బ్యాగు మర్చిపోయిన ప్రయాణికుడు

తిరిగి అప్పగించిన జీఆర్పీ పోలీసులు

తెనాలిరూరల్: రైలులో ప్రయాణికుడు ల్యాప్‌టాప్ బ్యాగును మర్చిపోయాడు. జీఆర్పీ పోలీసులను ఆశ్రయించగా గురువారం అందజేశారు. పట్టణానికి చెందిన యాకూబ్‌బాషా తన కుటుంబంతో కలసి హైదరాబాద్ వెళ్లి బుధవారం రాత్రి తిరిగి వచ్చాడు. గుంటూరులో రైలు దిగి తెనాలి వచ్చేందుకు గుంటూరు–రేపల్లె ప్యాసింజర్ రైలు ఎక్కారు. రైలులో ల్యాప్‌టాప్ ఉన్న బ్యాగును మర్చిపోయి తెనాలిలో దిగిపోయాడు. గ్రహించి వెంటనే జీఆర్పీ పోలీసులను ఆశ్రయించగా పోలీసులు రేపల్లె ఔట్ పోస్ట్ సిబ్బందికి సమాచారమిచ్చి బ్యాగును గుర్తించి గురువారం యాకూబ్‌బాషాకు అప్పగించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



తెనాలి: స్థానిక గాంధీనగర్‌లోని షిరిడీ సాయి వృద్ధాశ్రమంలో గురువారం శ్రీవెంకటేశ్వర యోగ సేవాకేంద్రం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పట్టణ ప్రముఖుడు, యోగ సభ్యుడు వంగర మాధవరావు 56వ జయంతి సందర్భంగా ఈ సేవాకార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా ఎస్‌వీ యోగ కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య మాట్లాడుతూ యోగ సభ్యులు జరుపుకునే శుభకార్యాలు, ఇతర సందర్భాలను ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేయాలని సూచించారు. మానవసేవ మాధవ సేవగా గుర్తుచేశారు. కార్యక్రమంలో వంగర జగదీశ్వరి, సోమరౌతు ఏసుబాబు, ఎం.సాయి కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు కుర్రా శ్రీనివాస రావు, ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, సునీత, యోగసాధకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కేబీ ప్రసాద్ డిమాండ్
- పట్టణంలో పలుచోట్ల ఘనంగా మేడే వేడుకలు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి కేబీ ప్రసాద్

తెనాలిఅర్బన్: కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు కృషి చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కెబీ ప్రసాద్ డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ తెనాలి శాఖ ఆధ్వర్యంలో మార్కెట్ వద్ద గురువారం మేడే వేడుకలను నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన జెండాను యూనియన్ గౌరవాధ్యక్షుడు షేక్ హుస్సేన్‌వలీ ఎగురవేశారు. ఈ సందర్భంగా బాబుప్రసాద్ మాట్లాడుతూ పనికి తగిన వేతనం అందక మున్సిపల్ కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి నేటికి వారంతపు సెలవులు లేవన్నారు. కార్యక్రమంలో నాయకులు మంద్రు మరియమ్మ, మంగళగిరి పద్మ, ముత్యాల పద్మావతి, పి.జయలక్ష్మి, వి.లక్ష్మీనారాయణ, ఎం.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

- తాపీవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గాంధీ చౌక్‌లో మేడే వేడుకలు నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన జెండాను యూనియన్ అధ్యక్షుడు షేక్ పకీర్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం అమెరికాలోని చికాగో నగరంలో సుదీర్ఘ పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆనాటి ప్రభుత్వం తీవ్ర నిర్బంధం ప్రయోగించిన కార్మికులు వెనుకంజ వేయకుండా హక్కులు సాధించుకున్నారని చెప్పారు. కార్మికులందరూ వారిని స్ఫూర్తిగా తీసుకుని సంఘటితం కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వినయ్‌కుమార్, మహబూబ్ సుభానీ, ఆర్.శ్రీనివాసరావు, వి.లక్ష్మణరావు, ఎస్.రాజ్యలక్ష్మి, చంద్రకళ, ఆశాబీ, తదితరులు పాల్గొన్నారు.

- ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఆర్టీసీ డిపో ఆవరణం ముందు నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన జెండాను తెనాలి గౌరవాధ్యక్షుడు బి.సాంబశివరావు ఎగురవేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఈపూరి విజయ్‌కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.రాజేష్‌ఖన్నా, డిపో కార్యదర్శి ఎన్.సుధాకర్, గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులు దీపాల దేవ శ్రీనివాసరావు, వి.జోషిబాబు, నాయకులు ఆళ్ళ వెంకటకృష్ణారెడ్డి, జి.రవీంద్ర, కె.వి.సుబ్బయ్య, ఎస్.శంకరరావు పాల్గొన్నారు.

హక్కుల కోసం ఉద్యమించాలి

కొల్లిపర: పుచ్చలపల్లి సుందరయ్య మేడే స్ఫూర్తితో కార్మిక వర్గం హక్కుల కోసం కార్మికులు ఉద్యమించాలని సీఐటీయూ నాయకులు ములకా శివ సాంబిరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సీఐటీయూ మండల అధ్యక్షురాలు ముకిరి జయప్రద అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. మండల కార్యదర్శి కోట చంద్రశేఖరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు సాంబిరెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి ఇప్పటి వరకు కార్మిక వర్గం ప్రభుత్వాల మీద యజమానుల మీద పోరాడి సాధించుకున్న చట్టాలను హక్కులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేస్తున్నాయని పేర్కొన్నారు. యజమానులకు బానిసలుగా కార్మిక వర్గాన్ని మార్చేందుకు చట్టాలను మారుస్తున్నారని ఆయన మండిపడ్డారు. కార్మిక కర్షక ఐక్యతతోనే ఈ విధానాలను తిప్పి కొట్టాలని ఆయన కోరారు. చంద్రశేఖరరావు మాట్లాడుతూ కార్మిక కర్షకులు కోసం సుందరయ్య జీవితాంతం కృషి చేశారని తెలిపారు. ఆయన ఆశయాలు ఆదర్శాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్మిక సంఘం నాయకులు సుందర్ రావు, మల్లోల రమేష్, సి.హెచ్.సంతోష్ కుమారి, షేక్ భాష, అజారుద్దీన్, డి.మల్లేశ్వరి, భక్తుల సుబ్బారావు, తిరుపతమ్మ, వనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవం

తెనాలి: సీపీఐ, ఏఐటీయూసీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయం ప్రాంగణంలో పార్టీ పతాకాన్ని సీనియర్ కమ్యూనిస్టు బొల్లిముంత కృష్ణ, ఏఐటీయూసీ పతాకాన్ని ఎస్.గురుబ్రహ్మం ఎగురవేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి అధ్యక్షత వహించారు. యువజన నేత పాశం వెంకటేష్ సభాపరిచయం చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, కొల్లిపర కార్యదర్శి తుంగ బాలస్వామి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గండు రవి, ఏపీసీపీడీసీఎల్ కార్యదర్శి జి.సీతారామ్, కె.సత్యం, ఎస్.వెంకటేష్, టి.నాగేశ్వరరావు, పి.నాగరాజు, ఎం.శ్రీకాంత్, టి.మహేష్, కె.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికులచే...

పట్టణ చెంచుపేటలోని విద్యుత్ కార్యాలయం దగ్గర ఏఐటీయూసీ అనుబంధ సంస్థ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. ఏఐటీయూసీ పతాకాన్ని రాష్ట్ర నాయకుడు ఎస్.గురుబ్రహ్మం ఆవిష్కరించారు. కార్మికులు, కర్షకులు మేడే స్ఫూర్తితో పోరాట వారసత్వాన్ని కొనసాగించాలని కోరారు. సీపీఐ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు మాట్లాడుతూ కార్మికులకు పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని సూచించారు. కార్మికులకు 139వ మేడే శుభాకాంక్షలు తెలియజేశారు.

తెనాలిలో...

తెనాలిటౌన్: మేడేను స్ఫూర్తిగా తీసుకుని కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా స్థానిక చెంచుపేటలోని విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం కార్మిక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెనాలి డివిజన్ తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్మిక జెండాను ఆవిష్కరించారు. కార్మికులు హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రీజనల్ అధ్యక్షుడు పరుచూరు పవన్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు షేక్ ఇబ్రహీం, కార్యదర్శి ఎం.నరసింహారావు, సభ్యులు రామారావు, మాణిక్యరావు, సునీల్, జగన్, ఆశోక్, శ్రీకాంత్, కోటేశ్వరరావు, హరికృష్ణ, వరపుత్ర, గౌస్, శివప్రసాద్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఆలపాటి

- మారీసుపేటలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మేడే వేడుకలో ఆ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చందు సాంబశివరావు పాల్గొని జెండాను ఆవిష్కరించారు. కార్మికుల హక్కుల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో పొన్నూరు నాగ సూర్యశేఖర రావు, గుర్రపు ద్వారక శ్రీనివాస్, పెనుగొండ శివకుమార్, రమేష్, స్టీవెన్‌బాబు, శంకరరావు, కృష్ణ, శ్రీను, అఖిల్, మల్లిఖార్జున, తదితరులు పాల్గొన్నారు.

- పట్టణ రైల్వేస్టేషన్ వంతెనపై ఆటోవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేడే వేడుకల్లో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్మిక జెండాను ఆవిష్కరించారు. ఆటోవర్కర్స్‌కు మిఠాయిలు పంపిణీ చేశారు. ఆటోవర్కర్ల కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్.నాగేశ్వరరావు, షేక్ బాజీ, మునీస్వామి, ఎ.వెంకటేశ్వరరావు, ప్రభాకరరావు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

హక్కులను కాపాడుకోవాలి

చుండూరు(వేమూరు): మే డే స్ఫూర్తితో కార్మికులు హక్కులను కాపాడు కోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శ టి.కృష్ణ మోహన్ తెలిపారు. గురువారం సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. చుండూరు రైతు విభాగం నాయకులు కె. శ్రీమన్నారాయణ, ప్రజా సంఘాల నాయకులు డి. గోపి వెంకట రెడ్డి, వివిధ శాఖ కార్మికులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి: పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని పంచాయతీ కార్యదర్శి ఈపూరి విజయబాబు పేర్కొన్నారు. గురువారం సంపద తయారీ కేంద్రం వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు, గాంధీ విగ్రహం వద్ద కార్మికులు, అధికారులు పతాకావిష్కరణ చేశారు.



ఆర్టీసీ డిపో వద్ద మేడే వేడుకల్లో పాల్గొన్న ఉద్యోగులు



సీపీఐ కార్యాలయంలో పతాకావిష్కరణ చేస్తున్న బొల్లిముంత కృష్ణ



విద్యుత్ కార్యాలయం వద్ద పతాకావిష్కరణ చేస్తున్న గురుబ్రహ్మం

రోడ్డు మార్జిను రాసిచ్చేశారా?



సబ్‌రిజిస్ట్రారు కార్యాలయం ఎదుట రోడ్డు మార్జినులో వెలిసిన షాపులు

- యథేచ్ఛగా వెలుస్తున్న దుకాణాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- బడుగు జీవులపై మాత్రం దాష్టీకం
- రాజకీయ సిఫార్సులతోనేనా మౌనం?

తెనాలి: ఆంధ్రాప్యారిస్ తెనాలి అనుకోవటం మినహా పట్టణాన్ని సుందర తెనాలిగా తీర్చుదిద్దటమంటే ఎందుకో పాలకులకు నచ్చదనే అనుకోవాల్సి వస్తోంది. పురాతన కాలం నుంచి ఉన్న తెనాలి కాలక్రమేణా విస్తరించుకుంటూ వస్తోంది. పెరుగుతున్న జనాభాకు తగినట్టుగా వసతులు లేవు. రోడ్ల సంగతి చెప్పాల్సిన అవసరం లేదు. మరీ ముఖ్యంగా పట్టణ నడిబొడ్డులోని కొత్తపేటలో ఇరుకు రోడ్లకు ఇరువైపులా వ్యాపార దుకాణాలు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. మరీ ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రోడ్ల ఆక్రమణ మరింత విస్తృతమైంది. బిజీ రహదారులు, ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో వివిధ రకాల వ్యాపార దుకాణాలు ఏర్పాటవుతున్నాయి. నడిరోడ్డుపైనే వ్యాపారాలు చేసేస్తున్నారు. ఇందులో చిన్న సైజు హోటళ్లు సైతం ఉన్నాయి.

సబ్ రిజిస్ట్రారు కార్యాలయం ఎదుట..

తాజాగా కొత్తపేటలోని సబ్‌రిజిస్ట్రారు కార్యాలయం ఎదుట ప్రహరీకి ఆనుకుని రెండు కార్యాలయాల నిర్మాణం చేపట్టారు. ఒకటి సిద్ధమై కార్యకలాపాలను సాగిస్తుండగా, పక్కనే మరొక కార్యాలయంలో పనులు కొనసాగుతున్నాయి. ఎవరు అనుమతులు ఇచ్చారో తెలీదు. పట్టపగలు రేకులు, సిమెంటు ఇటుకలతో నిర్మాణ పనులు చేసుకుంటూ నోటరీ తదితర కార్యాలయాలు ఏర్పాటవుతున్నా ఎవరికీ పట్టటం లేదు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుటనే అగ్నిమాపకశాఖ కార్యాలయం ఉంది. ఆ పక్కనే మండల తహసీల్దార్ కార్యాలయం, ఆ వరుసలోనే సబ్‌ట్రెజరీ, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, కోర్టు, రూరల్ పోలీస్ స్టేషన్...ఇన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. వీటిన్నిటికీ అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు, రైతులతో సహా నిత్యం ఎంతోమంది వచ్చి వెళుతుంటారు. ఇంతటి కీలకమైన రోడ్డుపై రోడ్డు మార్జినును ఆక్రమిస్తూ పకడ్బందీ నిర్మాణాలు చేస్తున్నా అధికారులు మౌనరాగం ఆలపించటంపై పౌరులు ఆశ్చర్యపోతున్నారు. ఇప్పటికే సబ్‌రిజిస్ట్రారు కార్యాలయం పక్కన, తహసీల్దార్ కార్యాలయానికి ఎదురు రోడ్డుకు ఇరువైపులా ఫొటోస్టాట్, నోటరీ, హోటల్ వంటివి నడుస్తున్నాయి. అవి చాలవన్నట్టుగా కొత్తగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎదురుగా రెండు నోటరీ కార్యాలయాల ఏర్పాటు, అధికారుల మౌనం వెనుక ఏదో 'రాజకీయం' ఉండే ఉంటుందని చెప్పుకుంటున్నారు. ఇదిలా ఉంటే తహసీల్దారు కార్యాలయం ముందుభాగంలో గేటుకు పడమర వైపున 45 ఏళ్లుగా ఒక హోటల్ నడుస్తోంది. ప్రస్తుతం ఆ స్థలంలో రెవెన్యూ అసోసియేషన్ నిర్మాణం చేపడుతోంది. నిర్మాణం పూర్తయ్యాక హోటల్ నడుపుకునేందుకు షాపు కేటాయిస్తామని అసోసియేషన్ ఆ చిరువ్యాపారికి హామీనిచ్చింది. ఈలోగా తామెలా బతకాలని అడిగితే ఎదురుగా ఉండే మూత్రశాల పక్కన నడుపుకోమని ఒక అధికారి సలహానిచ్చారు. అక్కడ హోటల్ సామాను పెట్టుకుంటే మున్సిపాలిటీకి చెందిన వెంకట్రామయ్య అనే ఉద్యోగి వచ్చి ఆ సామానును వాహనంలోకి ఎక్కించారు. తనకిక జీవనం పోతుందనే బాధతో ఈ చిరువ్యాపారి వంటిపై కిరోసిన్ పోసుకోవటంతో సామాను వదిలేసి వెళ్లాడని ఆ భార్యాభర్తలు గగ్గోలు పెట్టారు. దశాబ్దాలుగా హోటల్ నడుపుకుంటూ, మున్సిపల్ పన్ను, కరెంటు బిల్లు చెల్లిస్తూ ఉన్న చిరువ్యాపారులపై ప్రతాపం చూపిన మున్సిపల్ ఉద్యోగులకు, సబ్‌రిజిస్ట్రారు కార్యాలయం ఎదట ప్రహరీకి ఆనుకుని, రోడ్డు మార్జినును ఆక్రమించి నిర్మించిన రెండు షాపులు ఎందుకు కనిపించటం లేదో అర్థం కావటం లేదు.





తహసీల్దారు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పక్కన ఏర్పాటు చేసిన దుకాణాలు

వేర్వేరు ఘటనల్లో ఇరువురు ఆత్మహత్య

తెనాలిరూరల్: ఉరి వేసుకుని కూలీ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని అంగలకుదురు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎం. కోటేశ్వరరావు (45) కూలి పనులకు వెళుతుంటాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల నేపథ్యంలో బుధవారం రాత్రి ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అర్ధ రాత్రి గమనించిన కుటుంబ సభ్యులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య పార్వతి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ కె. ఆనంద్ తెలిపారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

మరో ఘటనలో ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ పాత ఆర్టీసీ డిపో ఏరియాకు చెందిన తరణి సాయికుమార్ (26) ఒక్కడే అద్దె ఇంట్లో నివసిస్తుంటాడు. ఆటో నడిపే ఇతను మద్యానికి బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు, మత్తుకు బానిసవడంతో గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి అతని సోదరుడికి సమాచారమివ్వడంతో మృతదేహాన్ని పరిశీలించి వన్‌టౌన్ పోలీసులకు తెలిపాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూసార పరీక్షలపై సమావేశం



వేమూరు: రైతులందరూ తమ పొలాలలో భూసార పరీక్షలు చేయించుకోవాలని బాపట్ల రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలో రైతులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మూడు పంటల తరువాత తప్పని సరిగా భూ సార పరీక్షలు చేయించుకోవాలన్నారు. సిఫారసు మేరకు ఎరువులు వాడకం చేపట్టాలని ఆయన సూచించారు. మండల వ్యవసాయాధికారి చందోలు సునీత మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు గ్రామ వ్యవసాయ అధికారులు ద్వారా చేయించుకోవాలని ఆమె తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

రేపల్లె: జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఓల్డ్ టౌన్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు ప్రారంభించి మాట్లాడారు. తొలిరోజు చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ కన్వీనర్ రాసంశెట్టి మహేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘ సభ్యులపై ఒత్తిడి

- ప్రధాని సభకు రాకపోతే రుణాలు నిలిపివేస్తామని హెచ్చరిక
- అధికారులపై పెరిగిన టీడీపీ, జనసేన నాయకుల ఒత్తిడి
- తెనాలి నియోజకవర్గం నుంచి బయలుదేరనున్న 302 బస్సులు

తెనాలిఅర్బన్: ప్రధాని మోదీ పర్యటన డ్వాక్రా సంఘాలకు కష్టాలు తెచ్చిపెట్టింది. గ్రూప్‌కు కనీసం అయిదుగురు తగ్గకుండా రావాలంటూ ఉన్నతాధికారులు హుకుం జారీ చేశారు. సభ్యులను సమీకరించే బాధ్యతలను కమ్యూనిటీ ఆఫీసర్‌లు, రిసోర్స్ పర్సన్‌లు, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్‌లు, యానిమేటర్‌లకు అప్పగించారు. దీంతో వారు వారం నుంచి సమీకరణ పనుల్లో నిమగ్నమయ్యారు. ఎవరైనా విముఖత చూపితే వారికి రుణాలు నిలిపివేస్తామంటూ బెదిరిపులకు పాల్పడుతున్నారు. చేసేదిలేక సభ్యులు శుక్రవారం రాజధాని అమరావతి వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు.

రాజధాని పునఃనిర్మాణ పనులు పుఃన ప్రారంభించేందుకు శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి వస్తున్నారు. సభకు అయిదు లక్షలు ప్రజలు వచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా తెనాలి నియోజకవర్గ పరిధిలోని సుమారు అయిదు వేలకుపైగా డ్వాక్రా గ్రూప్‌లు ఉన్నాయి. తెనాలికి అమరావతి సమీపంగా ఉండటంతో 15 వేల మందిని ఇక్కడి నుంచి తరలించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో పట్టణ పరిధిలోని డ్వాక్రా సీవోలు, ఆర్‌పీలు, మండల పరిధిలో ఏపీఎం, సీసీ, యానిమేటర్‌లకు అప్పగించారు. దీంతో వారు వారం నుంచి డ్వాక్రా సంఘ సభ్యులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సభ్యులను సమాయత్తం చేశారు.

తెనాలి నుంచి 302 బస్సులు

తెనాలి పట్టణం, కొల్లిపర, తెనాలి మండల పరిధిలో జన సమీకరణ జరిపేందుకు అధికారులు 302 బస్సులు ఏర్పాటు చేశారు. ఇవి శుక్రవారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య ఆయా వార్డులు, గ్రామాలకు రానున్నాయి. వాటిలో డ్వాక్రా సంఘాలకు కేటాయించిన బస్సులలో కనీసం గ్రూప్‌కు కనీసం ముగ్గురు తగ్గకుండా ఎక్కించేలా చర్యలు తీసుకుంటున్నారు.

తెనాలి పట్టణ పరిధిలో డ్వాక్రా మహిళల కోసం 42, మండల పరిధిలో26, కొల్లిపర పరిధిలో 46 బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. వీటిలో బస్సుకు 50 మంది చొప్పున ఎక్కించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సభ్యులను ఎక్కించే బాధ్యత డ్వాక్రా అధికారులతో పాటు సచివాలయ అడ్మిన్‌లు, గ్రామ కార్యదర్శులు, వెల్ఫేర్ సెక్రెటరీలకు అప్పగించారు. వీరు బస్సు రాగానే సభ్యులను ఎక్కించనున్నారు. వీరికి అవరమైన భోజనాన్ని కాజా టోల్‌ప్లాజా వద్ద సిద్ధం చేస్తున్నారు. అలాగే ప్రధాని పర్యటన పూర్తయిన తరువాత అక్కడే రాత్రి భోజనాన్ని కూడా అందించనున్నారు.

అధికార పార్టీ నాయకుల ఒత్తిడి

తెనాలిలోని టీడీపీ, జనసేన పార్టీ నాయకులతో ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను బస్సులలో ఎక్కించే బాధ్యతను ఆయా వార్డుల, గ్రామ ఇన్‌చార్జిలకు అప్పగించారు. తెనాలి పట్టణ పరిధిలో కూటమి నాయకుల కోసం 110, మండల పరిధిలో 26, కొల్లిపర పరిధిలో 52 బస్సులను ఏర్పాటు చేశారు. అయితే రాజధాని వెళ్ళేందుకు ఎక్కువ మంది కూటమి పార్టీల నాయకులు విముఖత చూపుతున్నారు. చేసేదిలేక నాయకులు మున్సిపల్, మండల అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. కూటమి బస్సులలో కూడా డ్వాక్రా సంఘ సభ్యులను ఎక్కించాలని హుకుం జారీ చేస్తున్నారు. చేసేదిలేక అధికారులు వారికి కేటాయించిన బస్సులలో కూడా డ్వాక్రా సంఘ సభ్యులను ఎక్కించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం మీద ప్రధాని పర్యటన డ్వాక్రా సంఘ సభ్యుల పాలిట శాపంగా మారిందని చెప్పవచ్చు.

కులగణనకు కేంద్రం సంసిద్ధతపై బీసీ సంఘం హర్షం

తెనాలి: జనాభా గణనతోపాటు కులగణన చేసేందుకు అంగీకరిస్తూ కేంద్రం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవటంపై ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం హర్షం వ్యక్తంచేసింది. స్థానిక వహాబ్‌రోడ్డులో దొడ్డపనేని ఇందిర విగ్రహం ఎదుట దేశ ప్రధాని నరేంద్ర మోదీ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బీసీ కులగణన కోసం రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు ఎంతోకాలంగా ఉద్యమిస్తున్న విషయం తెలిసిందేనని అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లోనూ నిరాహార దీక్షలు చేయటంతో అన్ని రాష్ట్రాల్నుంచి కులగణనకు సానుకూలత వ్యక్తమైందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో కేంద్రప్రభుత్వం కూడా కులగణనకు సంసిద్ధతను వ్యక్తంచేయటం సానుకూల పరిణామమని చెప్పారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు కుర్రా శ్రీను, 19వ వార్డు కౌన్సిలరు పసుపులేటి త్రిమూర్తి, 13వ వార్డు కౌన్సిలర్ కుర్రా సుజాత, వెల్లిల రాఘవ, మునిపల్లి వంశీ, జొన్నాదుల మురళి, రమేష్, పోతురాజు, షేక్ కాలేషా పాల్గొన్నారు.